# చింతచిగురు

'ఆరుద్ర'

ఆకలిరంగు చర్మాల్లో రెండెముకల గూళ్లు నిర్జనమైన, మాడుతున్న రోడ్డుమీద వారంట తూలుతూ నడుస్తున్నాయి. దరిద్రాన్ని కట్టుకొన్న, తెగమాసిన ఒకగూడు ఆడదానిలా కనబడుతున్నాది. నిరాశనీ మూలుగునీ మోసుకొంటూ ఆడగూడు పక్క నడుస్తున్న, బతుకు చస్తూన్న కళేబరం మొగదాని పోలికలతో కుంటుతున్నాది. కొలిమిలాంటి సూర్యుడిలోంచి బాగా కాలిన యినప ఊచల్లాంటి కిరణాలు నుదుటిమీద గుచ్చబడుతున్నాయి.

దారికి రెండుప్రక్కలా ఎలక్ట్రిక్ స్తంభాలు, టెలిగ్రాఫు స్తంభాలు వరుసగా నిలుచున్నాయి. టెలిగ్రాఫు స్తంభాల్లో కంపించిన గాడ్పు ఓంకారనాదం చేస్తున్నాది. ఎలక్ట్రిక్ స్తంభాల ఒంటికళ్లు జాలిగా, తెల్లగా శూన్యాన్ని పరీక్షిస్తున్నాయి. దారికి యిరుప్రక్కలా శ్మశానం అంత ఎడారిలాంటి బయలు క్షణక్షణానికి విస్తరించుతున్నాది.

ఎముకలగూళ్లు ఎక్కడ నుంచి ఎక్కడికి ఎందుకు ప్రయాణం చేస్తున్నాయో చెప్పటోడం బహుసులభం. ఆ ఆకలిరంగు చర్మాలే వాళ్లు అనుక్షణందుకు బయలుదేరా రని అడక్కుండా చెప్తాయి. ఇద్దరూ ఒకరిమీద ఒకరు ఆనుకొంటూ అతికష్టంమీద అడుగులీసి అడుగు వేస్తున్నారు. మొగాడి చేతులోని ఊతకర్ర రోడ్డుని కొలుస్తున్నాది.

గాడి పొయ్యిలాగ రోడ్డు సెగలు చిమ్ముతున్నాది. ఏనాటికి ముగుస్తుందో ఈ రోడ్డుమీద జరిగేవంట. ఏ కడుపులు నింపేందుకు జరుగుతున్నాదో ఈ వంట. ఇద్దరూ సోలుతూ నడుస్తున్నారు. ఇద్దరూ తూలుతూ సాగుతున్నారు. ఇద్దరూ నీరసంగా భూమిలోకి కుంగిపోతున్నారు.

దారి అంచుమీద జారుతూ నడుస్తున్నారు.

దారి అంచుమీద జారుతూ నడుస్తున్నారు. కంకర రాళ్ళమీద గుండం తొక్కుతున్నారు. ఎవరో ముందుకు తోస్తూఉంటే ఆశతో సాగుతున్నారు. ఏదో వెనక్కు లాగేస్తూఉంటే బాధతో ఆగిపోతున్నారు. మళ్ళా ఎవరో నెట్టుతూ ఉంటే పచ్చతనాన్ని ఆలోచించుకొంటూ ముందుకు అడుగేస్తున్నారు.

ఇద్దరిలో ఒకరు మాట్లాడడంలేదు. వాళ్ళ నాలికలు చాలాకాలం నుంచీ, యుగయుగాల నుంచీ పిడచకట్టుకు పోయాయి. ఎండిపోయిన దిగుడు బావుల్లాంటి వాళ్ళగొంతుకలలో నాదాలు ఏ స్వరాలని పలకడంలేదు. నాలికమీద ఆశని వాయించే మాటలు హరించుకు పోతున్నాయి. ఆడగూడు నాలికని మీద పెదవిమీదుగా పోనిచ్చి తడిచేసుకుంది. చేసుకున్నట్టు అనుకుంది.

# చింత చిగురు

మొగాడు భుజంమీద జారుతున్న జోలెని ఎగసన తోసుకొన్నాడు. ఇద్దరూ మాట్లాడకుండా నడుస్తున్నారు.

రోడ్డుకి ఇరుపంచలా ఉన్న కుక్కగొడుగుల్లాంటి వృక్షరాశి ఉన్నా లేనట్టే ఉంది. ఎంత దూరం నడిచారో చెప్పడం కష్టం. ఊతకర్ర కూడా మూగిదయింది. కనుచూపు మేరలో మాత్రం ఒక చింతచెట్టు అభయహస్తాలని నాలుగుప్రక్కలా చాపి ఏడుకొండలవాడి పోజులో దారి పోలీసువాడిలా నించుంది. ఈ ఈ ముస్తివాళ్ళ గమ్యస్థానం అదేనని సులువుగా పోల్చుకోవచ్చు.

కిందా మీదా పడుతూ ఇద్దరూ చెట్టుకిందకి చేరుకున్నారు. చెట్టుకింద చేటంత నీడలో కూలబడ్డారు. ఇద్దరూ ఒకేసారి నిట్టూర్చారు. వేడిగా ఒక చెమట బొట్టూ, ఒక కన్నీటిచుక్కా రాల్చారు. మగఆకారం జోలెలోంచి ఒక సీసా తీసింది. కొన్నాళ్ళ కిందట అతివిలువైన సీమ చేపనూనె ఆ సీసాలో కూర్చుని ఈ దేశంలో దిగింది. ఈసీసాలో నీళ్ళుపట్టి కాగితం మూత పెట్టి ఇద్దరూ దాచుకున్నారు. మొగాడు బుడ్డితీసి కొంచెం తడుపుకున్నాడు. నీళ్లు వేడెక్కిపోయాయి. సీసాని ఆడదానికి అందిచ్చాడు.

ఎండకి వెరచిన కాకొకటి చెట్టుమీద కదలి ఒక ఎండుబొట్టని రాల్చించి. అదిసమంగా ఆడదాని వళ్లోపడ్డాది. ఆడది చింతబొట్టని రుచి చూసి ప్రాణాన్ని సర్దుకుంది. మొగాడికి సలహా యిచ్చింది. మొగాడు నిటారుగా నిల్చుని చెయ్యి మీది కెత్తాడు. కొమ్మ అందుకురాలేదు. ఊతకర్రతో చిగురుని కదిపాడు. జీర్ణించిపోతున్న సత్తువని కూడదీసుకుని పూరాగా కొమ్మని కొట్టాడు. కొంత చిగురు రాలింది. ఆడదాన్ని తినమన్నాడు. ఆడది రెండు చిగురాకుల్ని నాలికమీద పెట్టుకొని చప్పరించింది. తల ఊపి చిగురంతా రెండుచేతులా తీసుకొని నోట్లో కుక్కుకుంది, అతివేగంతో నమిలింది.

మొగాడు మరి ఒక ఆకేనా రాల్చలేకపోయాడు. మొదలు తెగిన చెట్టులా కూలిపోయాడు. మూర్ఛలక్షణాలు మొగంమీద పచారుచేస్తున్నాయి. ఆడది సీసాలో నీళ్లని వాడి మొగంమీద జల్లబోయింది. మొగాడు కళ్ళు విప్పకుండా ఆడదాన్ని ఆనీళ్ళు తాగమని సంజ్ఞ చేశాడు. ఏడ్చి కన్నీళ్లు రాల్చేందుకు సరిపోయిన సత్తువ ఆడదానిలో ఉంది.